# పనిచేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



బీఆర్ఎస్‌లో చేరిన నాయకులతో మంత్రి హరీశ్‌రావు, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

- కార్యకర్తలంతా సమష్టిగా పనిచేయండి
- ఆర్థిక, వైద్యారోగ్య శాఖల తన్నీరు హరీశ్‌రావు
- ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు

వర్గల్, అక్టోబర్ 28 : ప్రజల కోసం నిరంతరం పనిచేసే ప్రభుత్వానికి అండగా నిలవాలని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం మంత్రి నివాసంలో వర్గల్ మండలం సింగాయిపల్లి, అనంతగిరిపల్లి గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేశారు. ఈ సందర్భంగా వారికి మంత్రి హరీశ్ రావు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ కేసీఆర్‌కు మండల ప్రజలు అండగా నిలబడి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ప్రతిపక్షాలకు డిపాజిట్ కూడా రాకుండా కార్యకర్తలంతా కష్టపడి పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల నాయకులు వెంటక్‌రెడ్డి, నాగరాజు, సర్పంచులు అప్పిడి సునీతారమణారెడ్డి, వేణుగోపాలరావు, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌కే మా మద్దతు

**ఏకగ్రీవ తీర్మానం చేసిన టీవీ కేబుల్ ఆపరేటర్లు**

గజ్వేల్, అక్టోబర్ 28 : గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన టీవీ కేబుల్ ఆపరేటర్లు సీఎం కేసీఆర్‌కు మద్దతు తెలుపుతూ శనివారం ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అనంతరం ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిని కలిసి ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీసీ చైర్మన్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌తోనే గజ్వేల్ అభివృద్ధి జరిగిందన్నారు. గజ్వేల్‌ను అభివృద్ధి చేసిన కేసీఆర్‌ను అత్యధిక మెజార్టీ అందించి రుణం తీర్చుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రతిఒక్కరూ కేసీఆర్‌కే మద్దతు తెలిపేలా ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. నెల రోజులపాటు ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. కేసీఆర్ హ్యాట్రిక్ ముఖ్యమంత్రి అయితే గజ్వేల్ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కేసీఆర్‌తోనే రాష్ట్ర ప్రజలకు న్యాయం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, గజ్వేల్ డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ ఉడెం కృష్ణారెడ్డి, మైనార్టీ నాయకులు జాఫర్‌ఖాన్, ఆపరేటర్లు శ్రీనివాస్, శ్రీధర్, ఆంజనేయులు, నర్సింహచారి పాల్గొన్నారు.


సీఎం కేసీఆర్‌కు మద్దతుగా ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డికి అందజేస్తున్న టీవీ కేబుల్ ఆపరేటర్లు



# కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేద్దాం

**మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి**

గజ్వేల్‌అర్బన్, అక్టోబర్ 28 : కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్త పనిచేయాలని మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి అన్నారు. శనివారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ కౌన్సిలర్లు, బూత్‌లెవల్ నాయకులతో కార్యాచరణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఇంటికే వెళ్లి సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. సీఎం కేసీఆర్‌తో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. కేసీఆర్ గెలుపే లక్ష్యంగా అవిశ్రాంతంగా కృషిచేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ జకీయొద్దీన్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు నవాజ్‌మీరా, కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, ఉప్పలమెట్టయ్య, రజిత, బాలమణి, అత్తెల్లి శ్రీనివాస్, రహీం, బొగ్గుల చందు, నాయకులు కిషన్‌రెడ్డి, మల్లేశం, గుంటుకు రాజు, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింగరావు, సమీర్, కనకయ్య, ఆయా వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి

## హుస్నాబాద్ డిపోను లాభాట బాటలో నడిపించాలి

**కరీంనగర్ రీజినల్ మేనేజర్ సుచరిత**



డ్రైవర్లకు సేఫ్టీ డ్రైవింగ్‌పై అవగాహన కల్పిస్తున్న ఆర్ఎం సుచరిత

హుస్నాబాద్, అక్టోబర్ 28: ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు సమన్వయంతో పనిచేసి హుస్నాబాద్ డిపోను లాభాల బాటలో నడిపించాలని కరీంనగర్ రీజినల్ మేనేజర్ సుచరిత అన్నారు. శనివారం హుస్నాబాద్ ఆర్టీసీ డిపోను సందర్శించి డ్రైవర్లకు సేఫ్టీ డ్రైవింగ్‌పై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమన్నారు. అంతకు ముందు డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదర్శ ఉద్యోగులకు ప్రగతి రథచక్రవ అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ నర్సయ్య, సూపరింటెండెంట్ శ్రీధర్, ఏఎంఎఫ్ సామ్యూల్, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.



నారాయణఖేడ్‌లో ప్రజా ఆశీర్వాద సభాస్థలిలో కొనసాగుతున్న ఏర్పాట్లు

# రేపు నారాయణఖేడ్‌లో ప్రజా ఆశీర్వాద సభ

- సీఎం కేసీఆర్ సభను జయప్రదం చేయాలి
- 'ఖేడ్' ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, అక్టోబర్ 28 : ఈ నెల 30న నారాయణఖేడ్‌లో సీఎం కేసీఆర్ పాల్గొననున్న ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి కోరారు. బహిరంగ సభకు మధ్యాహ్నం 2 గంటలకు సీఎం కేసీఆర్ హాజరవుతారని, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దసంఖ్యలో సభకు హాజరుకావాలని కోరారు. వెనుకపడిన ప్రాంతంగా ఉన్న నారాయణఖేడ్ నియోజకవర్గంపై సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ చూపడంతోనే నియోజకవర్గం అన్ని రంగాల్లో ఊహించని రీతిలో అభివృద్ధి చెందిందన్నారు. ప్రజా ఆశీర్వాదసభ సందర్భంగా సీఎం కేసీఆర్‌ను దీవించేందుకు ప్రజలు భారీగా తరలిరావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

**ఆశీర్వాద సభ కోసం చురుగ్గా ఏర్పాట్లు**

నారాయణఖేడ్‌లో నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాదసభ ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. పట్టణంలోని కరస్‌గుత్తి రోడ్డు ప్రాంతంలో సీఎం సభాస్థలిని ఏర్పాటు చేస్తున్నారు. భద్రతా అంశాలను పరిగణనలోకి తీసుకుని అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. సభాస్థలిలో సభావేదిక, సభాప్రాంగణానికి అవసరమైన పనులు చేపడుతున్నారు.

# అధికారులు సమన్వయంతో పనిచేయాలి

**జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్**

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 28 : అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్స్, నియోజకవర్గ స్థాయి ఆఖరి రోజు శిక్షణ నిర్వహించారు. ఈవీఎం మిషన్లలో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్ మిషన్ల అనుసంధాన ప్రక్రియ, వీవీ ప్యాట్‌లో పేపర్ అమర్చే విధానం, కంట్రోల్ యూనిట్ ఆపరేట్ చేసే దశల గురించి ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకా రం క్షుణ్ణంగా వివరించారు. అనంతరం పోలింగ్ రోజు నిర్వహించే మాక్ పోల్ ప్రక్రియ గురించి క్షుణ్ణంగా తెలిపి నమూనా పోలింగ్ ఎలా చేస్తున్నారో గమనించి.. సందేహాలు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్టార్ అధికారులు తమకు కేటాయించిన పోలింగ్ స్టేషన్లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏఆర్వోలు, సెక్టార్ అధికారులు మండలంలోని గ్రామాల్లో పంచాయతీ సెక్రటరీతో సమావేశాలు నిర్వహించి పోలింగ్ స్టేషన్‌లో గల సదుపాయాలపై ఆరా తీయాలన్నారు. సెక్టార్ అధికారులు, స్టేషన్ హౌస్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికరాలు సమన్వయంతో పనిచేయాలన్నారు. పోలింగ్ రోజు ఓటర్లకు అర్థమయ్యేలా పోలింగ్ స్టేషన్ ఆవరణలో ఓటర్ అసిస్టెంట్ బూత్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

పోలింగ్ స్టేషన్ చుట్టూ 100మీటర్ల దూరంలో ప్రచారాలు, వాల్‌పోస్టర్లు, హోర్డింగ్ ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలన్నారు. నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్స్ తమ నియోజకవర్గాల్లో పోలింగ్ సిబ్బందికి నిర్వహించే శిక్షణా తరగతుల్లో ఏ ఒక్క పాయింట్ కూడా వదలకుండా కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించేలా శిక్షణ అందించాలన్నారు. సమావేశంలో సిద్దిపేట, గజ్వేల్ ఆర్వోలు రమేశ్‌బాబు, బన్సీలాల్, జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్స్ బృంద అధికారి అయోధ్య రెడ్డి పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్